www.siddipetpower.com

# సిద్ధిపేట పవర్

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న
సంచలన సమాచార దినపత్రిక 'సిద్ధిపేట పవర్' తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సి ఇంచార్జ్ లు కావలెను

ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి

ఫోన్: 9866338848

సంపుటి: 01 | సంచిక: 09 | హైదరాబాద్ | బుధవారం | 02-04-2025 | పేజీలు: 04

# ఆందోళనలు.. 02 అరెస్టులు..

**హెచ్సీయూలో కొనసాగుతున్న విద్యార్థుల నిరసన**

**యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు ప్రతిపక్షాల యత్నం**

**అరెస్టు చేసిన పీఎస్ లకు తరలించిన పోలీసులు**







## పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

**భూములను అమ్ముకొని వేల కోట్లు దండుకోవాలని చూస్తున్నారు**

**400 ఎకరాలు అటవీ పరిధిలోకి వస్తుంది**

**కాంగ్రెస్ ప్రభుత్వం కోర్ట్ ధిక్కారణకు పాల్పడుతుంది**

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**



2

## విధ్వంసమే మీ ఏకైక నినాదం..

హెచ్‌సీయూ వ్యవహారంలో రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ఏజెంటులా మారింది

హెచ్‌సీయూలో ప్రభుత్వ వ్యవహారం పై కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):**

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రణరంగాన్ని తలపిస్తోంది. విద్యార్థుల ఆందోళనలతో విశ్వవిద్యాలయం దద్దరిల్లుతోంది. ఈ మేరకు యూనివర్సిటీ వ్యవహారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తీవ్రంగా స్పందించారు. తొలుత పర్యావరణ పరిరక్షణ పేరుతో చాలా మంది పేదల ఇండ్లను కూల్చివేశారని మండిపడ్డారు. ఆ తర్వాత అభివృద్ధి పేరుతో గిరిజన గ్రామాలను వెంబడించారని.. బంజరు భూములు, బల్లులు కూడా గుడ్లు పెట్టవు అన్నారని.. ఇప్పుడు మీరు జంతువుల గూళ్ళను వెంటాడి సామూహిక హత్యలు చేస్తారంటూ మండిపడ్డారు. మీ సమర్థన? అభివృద్ధా? ప్రభుత్వ భూమా? మీది ప్రభుత్వమా లేక బుల్డోజర్ కంపెనీనా?! మీరు ఎన్నికైన ప్రతినిధినా లేక రియల్ ఎస్టేట్ ఏజెంట్‌నా?! అంటూ ప్రశ్నించారు. విధ్వంసం మీ ఏకైక నినాదం! మీ ఖజానాను దాఖలు చేయడమే ఏకైక నినాదం! నేను మిమ్మల్ని అడుగుతున్నాను రేవంత్ రెడ్డి.. మీ బుల్డోజర్లు వారాంతంలో, రాత్రిపూట ఎందుకు నిరంతరాయంగా పనిచేశాయి? మీరు కోర్టుకు ఎందుకు భయపడుతున్నారు? మీరు ఏమి దాచారు? అంటూ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో హెచ్‌సీయూ భూముల్లో బుల్డోజర్లు చదును చేస్తుండడంతో అక్కడి అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో జింకలు అక్కడ ఏం జరుగుతుందో తెలియక ఆగమాగం అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. పెద్ద సంఖ్యలో అర్ధరాత్రి మోహరించిన

...మిగతా 2లో



పేదల ఆత్మగౌరవాన్ని పెంచేందుకే

## సన్న బియ్యం పంపిణీ

- **పేదలకు సన్న బియ్యం పంపిణీ సాహసోపేతమైన నిర్ణయం**
- **సన్న బియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది : కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

2



“వక్ఫ్ బిల్లు” పాస్ అవుతుందా..

## బీజేపీ, ఇండీ కూటమి బలాబలాలు ఎంత..?

- **పార్లమెంట్ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు..**
- **అడ్డుకునేందుకు ప్రతిపక్షాల వ్యూహాలు..**
- **ఎన్డీయే, ఇండియా కూటమి బలాబలాలు ఇవే..**

2

## తాగు, సాగునీటికి దోకా లేదు.. క్లారిటీ ఇచ్చిన మంత్రి పొన్నం

**నీటి నిల్వలు – గణాంకాలతో స్పష్టత**

**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):**

తాగునీటి సరఫరా అంశాన్ని రాజకీయం చేయడం అసంతృప్తికరమని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని

...మిగతా 2లో



## విద్యార్థుల ఆందోళన.. హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

- **ప్రియాంక గాంధీ భర్త కోసమే భూముల అమ్మకం?**
- **కోదండ రామ్ రెడ్డికి కళ్లు కనిపించడం లేదా?**
- **ఈ భూములను రాబర్ట్ వాద్రా కోసమే అమ్ముతున్నావా?**
- **బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రశ్నలు**



2

హైదరాబాద్‌లో విదేశీ యువతిపై

## అత్యాచారం..

సెలవుల కోసం

ఇండియాకు వచ్చిన విదేశీ యువతి

షాపింగ్ కోసం

క్యాబ్ ని బుక్ చేసుకున్న

విదేశీ యువతి, యువకుడు

మీర్ పెట్ పరిధిలో ఫ్రెండ్స్ ఇంట్లో స్టే

చేస్తున్న విదేశీ యువతి, యువకుడు

2

## వదిలిపెట్టే సమస్యే లేదు..

- **మార్చి 31 వరకు ఇస్తానన్న మాట తుంగలో తొక్కారు**
- **సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ధ్వజం**



2

## హెచ్‌సీయూ పరిణామాలపై మంత్రులతో సమీక్షించిన సీఎం

- **తాజా పరిస్థితులపై ఆరా తీసిన రేవంత్ రెడ్డి**
- **400 ఎకరాలు ప్రభుత్వానికి చెందినదని మంత్రి పొంగులేటి స్పష్టం**
- **పెద్దఎత్తున కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు**



2

# ఆందోళనలు.. అరెస్టులు..

- హెచ్సీయూలో కొనసాగుతున్న విద్యార్థులు నిరసన
- యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు ప్రతిపక్షాల యత్నం
- అరెస్టు చేసిన పీఎస్ లకు తరలించిన పోలీసులు

**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** హెచ్సీయూ యూనివర్సిటీలో భూములను చదును చేయడంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. వారికి తోడు ప్రతిపక్ష నాయకులు చేతుల కలపడంతో విశ్వవిద్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయి. కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆ భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. మరోవైపు యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు.



# పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

- భూములను అమ్ముకొని వేల కోట్లు దండుకోవాలని చూస్తున్నారు
- 400 ఎకరాలు అటవీ పరిధోలోకి వస్తుంది
- కాంగ్రెస్ ప్రభుత్వం కోర్ట్ ధిక్కారణకు పాల్పడుతుంది
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలని యత్నిస్తున్న 400 ఎకరాల భూమి అటవీ శాఖ పరిధిలో ఉందని, అటువంటి భూమిని కేంద్ర అనుమతి లేకుండా నరికివేయలేమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని అన్నారు. గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూవివాదంపై హైకోర్టులో కేసు నడుస్తోందని బండి సంజయ్ గుర్తు చేశారు. వట ఫౌండేషన్ అనే ఎన్జీవో దాఖలు చేసిన కేసులో హైకోర్టు ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని తెలిపారు. కోర్టు కేసు నడుస్తున్నా, ప్రభుత్వం భూముల చదునుకు పాల్పడడం కోర్టు ధిక్కరణకే సంబంధించిన విషయమని ఆరోపించారు.

రాష్ట్ర ప్రభుత్వం చెట్లను తొలగించి, పర్యావరణ విధ్వంసం చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. భూములను డీఫారెస్టైజేషన్ చేసి వేలం వేసి కోట్లు దండుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం మరింత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ పార్టీ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్టగా నిలుస్తుందని బండి సంజయ్ విమర్శించారు. గతంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల అమ్మకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేస్తూ, ఇప్పుడు తన వైఖరి మారడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే భూముల విక్రయంపై ప్రభుత్వం వెనుకడగు వేయాలని, లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



## రైల్ రోకో ఘటనపై కేసీఆర్ పిటిషన్ తెలంగాణ హై కోర్టులో విచారణ

**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్ధిపేట పవర్):** తెలంగాణ ఉద్యమ సమయంలో రైల్‌రోకో ఘటనలో నమోదైన కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటీషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. 2011 అక్టోబర్ 15న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా సికింద్రాబాద్‌లో రైల్‌రోకో చేపట్టారు. ఆ సమయంలో కేసు నమోదు చేసి పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు ప్రస్తుతం ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసీఆర్ పిలుపు మేరకే రైల్‌రోకో చేపట్టారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. అయితే, రైల్‌రోకో జరిగిన సమయంలో అక్కడ కేసీఆర్ లేరని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం.. రైల్‌రోకో ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తికి నోటీసులివ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

# తాగు, సాగునీటికి డోకా లేదు.. క్లారిటీ ఇచ్చిన మంత్రి పొన్నం

**మొదటిపేజి తరువాయి**

ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. "కొంతమంది నాయకులు కావాలని అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు," అని ఆయన వ్యాఖ్యానించారు.

ఎల్‌ఎండి, మిడ్ మానేరు ప్రాజెక్టులలో తాగునీటి అవసరాలకు తగినన్ని నీటి నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి నీటి నిల్వలు మెరుగ్గానే ఉన్నట్లు ఆయన వివరించారు. కరీంనగర్ మున్సిపాలిటీ, మిషన్ భగీరథ ప్రాజెక్టు తాగునీటి అవసరాల కోసం తగినన్ని నీటి నిల్వలు ఉంచామని, మిగిలిన నీటిని సాగునీటి అవసరాల కోసం వదులుతున్నట్లు వెల్లడించారు.

నీటి నిల్వలు - గణాంకాలతో స్పష్టత గత ఏడాది ఇదే రోజున లోయర్ మానేరు డ్యామ్ లో 5.00 టీఎంసీలు ఉండగా, ఈ ఏడాది 5.700 టీఎంసీలు ఉన్నాయి. మిడ్ మానేరు డ్యామ్ లో గత ఏడాది 8.00 టీఎంసీలు ఉండగా, ఈ ఏడాది 9.480 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. జూలై 31 వరకు లోయర్ మానేరు డ్యాంలో తాగునీటి అవసరాల కోసం 6.90 టీఎంసీలు అవసరం అని ఆయన తెలిపారు.

మిడ్ మానేరు డ్యామ్ నుంచి 3.00 టీఎంసీల నీటిని లోయర్ మానేరు డ్యాంకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. సాగునీటి అవసరాల కోసం జోన్2 ఆయకట్టుకు ఈ నెల 6 వరకు 2500 క్యూసెక్కుల నీటిని అందించనున్నట్లు మంత్రి వివరించారు.

"కరీంనగర్ మున్సిపాలిటీ, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు తాగునీటి కొరత లేదని" మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొన్ని వర్గాలు కావాలని తాగునీటి సరఫరాపై అనవసరమైన అపోహలు కలిగించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి అని ఆరోపించారు. "ప్రజలు నిజాన్ని అర్థం చేసుకుంటారు, అసత్య ప్రచారాలు చేసే వారికి తగిన బుద్ధి చెబుతారు" అని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం తాగునీటి సమస్యలను ముందస్తుగా అంచనా వేసి తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని, నిరాధార ఆరోపణలను విశ్వసించవద్దని మంత్రి కోరారు.

# హెచ్‌సీయూ పరిణామాలపై మంత్రులతో సమీక్షించిన సీఎం

- తాజా పరిస్థితులపై ఆరా తీసిన రేవంత్ రెడ్డి
- 400 ఎకరాలు ప్రభుత్వానికి చెందినదని మంత్రి పొంగులేటి స్పష్టం
- పెద్దఎత్తున కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు

**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** కంచ గచ్చిబౌలి పరిధిలోని భూములపై విద్యార్థుల ఆందోళనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ ఆ భూముల వ్యవహారం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఆందోళనలు, తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ప్రస్తుత పరిస్థితులపై అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చర్చించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో సీఎం సమీక్షించారు. ఈ అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి సాయంత్రం మీడియాతో మాట్లాడే అవకాశం ఉంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో 400 ఎకరాలపై యాజమాన్య హక్కులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానివేనని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. దీనిపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో వేసిన వ్యాజ్యాలపై పోరాడి కాంగ్రెస్ ప్రభుత్వం హక్కులు దక్కించుకుందని పేర్కొన్నారు. ఈ భూమిలో ఒక్క అంగుళం కూడా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందినది లేదని పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి సృష్టించే ఎటువంటి వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఆ భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. హెచ్‌సీయూని సందర్శించేందుకు బయల్దేరిన భాజపా నేతలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. హెచ్‌సీయూ సందర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని అరెస్టు చేశారు.

# హైదరాబాద్‌లో విదేశీ యువతిపై అత్యాచారం..

- సెలవుల కోసం ఇండియాకు వచ్చిన విదేశీ యువతి
- షాపింగ్ కోసం క్యాబ్ ని బుక్ చేసుకున్న విదేశీ యువతి, యువకుడు
- మీర్ పెట్ పరిధిలో ఫ్రెండ్స్ ఇంట్లో స్టే చేస్తున్న విదేశీ యువతి, యువకుడు
- ఈ నేపథ్యంలో యువతిపై అత్యాచారం చేసిన క్యాబ్ డ్రైవర్



**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** హైదరాబాద్‌లో మరో దారుణ సంఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. పహాడీ షరీఫ్ ప్రాంతంలో ఓ విదేశీ యువతిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారం చేసిన ఘటన కలకలం రేపుతోంది. ఈ ఘటనలో నిందితుడు క్యాబ్ డ్రైవర్‌గా పోలీసులు గుర్తించారు. సెలవుల కోసం ఇండియాకు వచ్చిన ఈ విదేశీ యువతి షాపింగ్ చేసేందుకు క్యాబ్ బుక్ చేసుకుంది. మీర్‌పేట్ పరిధిలోని ఫ్రెండ్ ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్న ఆమె, తన ఫ్రెండ్ అయిన మరో విదేశీ యువకుడు, పిల్లలతో కలిసి షాపింగ్ కోసం బయలుదేరింది. క్యాబ్‌లో గంటన్నర పాటు తిరిగిన తర్వాత, పహాడీ షరీఫ్ ప్రాంతానికి చేరుకోగానే క్యాబ్ డ్రైవర్ ఆ యువకుడిని, పిల్లలను కిందికి దించేశాడు. అయితే, యువతిని మాత్రం కారులో ముందుకు తీసుకెళ్లాడు.

కొంతదూరం తీసుకెళ్లిన తర్వాత, నిర్మానుష్య ప్రదేశంలో ఆ యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తిరిగి ఆమెను తీసుకువచ్చి, ఆమె స్నేహితుడి వద్ద వదిలేసి పరారయ్యాడు. బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా, అధికారులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనా స్థలానికి సమీపంలోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తూ, డ్రైవర్‌ను గుర్తించే పనిలో ఉన్నారు. ఈ ఘటన నగరంలో మహిళా భద్రతపై మరోసారి ఆందోళనలు రేకెత్తిస్తోంది.

# విద్యార్థుల ఆందోళన.. హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

- ప్రియాంక గాంధీ భర్త కోసమే భూముల అమ్మకం?
- కోదండ రామ్ రెడ్డికి కళ్లు కనిపించడం లేదా? ఈ భూములను రాబర్ట్ వాద్రా కోసమే అమ్ముతున్నావా?
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రశ్నలు

**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** జన సమితి కోదండ రామ్ రెడ్డికి కళ్లు కనిపించడం లేదా? అని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమి వేలంపై ఆయన మాట్లాడారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని... ఈ భూములను కాపాడుతామన్నారు. భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులని గుర్తు చేశారు. ఈ భూములను రాబర్ట్ వాద్రా కోసమే అమ్ముతున్నావా? అని ప్రశ్నించారు. ప్రియాంక గాంధీ భర్త కోసమే భూముల అమ్ముతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. కేటీఆర్ దొంగ ఏడ్పులు ఏడుస్తున్నారని విమర్శించారు. అవి సెంట్రల్ యూనివర్సిటీ భూములు కాదని కోర్టుకు మీరు అఫిడవిట్ ఇచ్చింది వాస్తవం కాదా? అని అడిగారు. ఇద్దరు కలసి నాటకం ఆడుతున్నారని.. ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం లో అరాచక పాలన నడుస్తుందని మండిపడ్డారు.

"భూములను తెగ నమ్ముకుంటామని, రియల్ ఎస్టేట్ దందా చేస్తామని అంటున్నారు. ప్రజా పాలనను గాలికి వదిలేసిశారు. పోలీసుల నిర్బంధం కొనసాగుతుంది. ఎన్ని రోజులు అడ్డుకుంటారు. మేము హెచ్‌సీయూకి వెళ్తాం... విద్యార్థులకు అండగా ఉంటాం. భూములను అమ్ముతమనుకుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదు. మేము అన్ని యూనివర్సిటీ లని సందర్శిస్తాం. భూములను కొనేందుకు యే వ్యాపార వేత్త ముందుకు రావొద్దు. తెలంగాణ ఉద్యమం లో 369 మంది ప్రాణాలు కోల్పోయారు. కాంగ్రెస్ తమ పాపాలను కడుక్కోవడానికి సెంట్రల్ యూనివర్శిటీ ఇచ్చారు. కాంగ్రెస్ అంటేనే మాట తప్పడం. ఉగాది రోజు న ప్రజా స్వామ్య పద్ధతిలో ఉద్యమం చేసిన విద్యార్థుల పై లాఠీ ఛార్జ్ చేశారు. టీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం భూములను అమ్మింది....ఇప్పుడు మేము ఎందుకు అమ్మొదని కాంగ్రెస్ అనుకుంటుంది. రేవంత్ రెడ్డి కొకపేట భూములను అమ్మొద్దని అప్పట్లో ఉద్యమం చేశారు... సీబీఐకి ఫిర్యాదు చేశారు. విద్యార్థుల మీద లాఠీ ఛార్జ్ చేసినందుకు రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టాలి. ఈ భూమి యే గుంట నక్క కోసం ఇవ్వాలని అనుకుంటున్నారో రేవంత్ రెడ్డి చెప్పాలి." అని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# పేదల ఆత్మగౌరవాన్ని పెంచేందుకే సన్న బియ్యం పంపిణీ

- పేదలకు సన్న బియ్యం పంపిణీ సాహసోపేతమైన నిర్ణయం
- సన్న బియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది : కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** పేద ప్రజల ఆహార భద్రతను మెరుగుపరిచేందుకు సన్న బియ్యం పంపిణీ సాహసోపేత నిర్ణయమని తెలంగాణ మునిసిపల్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ పథకం వల్ల పేదల ఆత్మగౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించిందని ఆయన వివరించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "గత ప్రభుత్వాలు రేషన్ కార్డుల పంపిణీ విషయంలో పూర్తిగా విఫలమయ్యాయి. రేషన్ షాపులను నిర్వీర్యం చేయడంతోపాటు, పేదలకు నాణ్యమైన ఆహారం అందించడంలో విఫలమయ్యాయి" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం పేదలకు లబ్ధి చేకూర్చే గొప్ప అడుగు అని తెలిపారు.

ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో రేషన్ బస్తాలపై ఉండాలన్న బండి సంజయ్ వ్యాఖ్యలపై స్పందించిన ఆయన, "ఈ దేశానికి ఆదాయ వనరు రాష్ట్రాలే. రాష్ట్రాల ఆదాయమే కేంద్రానికి ఆదాయం. ఆర్థిక వ్యవస్థ రాష్ట్రాల పన్నుల మీద ఆధారపడి ఉంది" అని స్పష్టం చేశారు. "ఫోటోలు పెట్టాల్సి వస్తే, రాష్ట్ర ముఖ్యమంత్రుల ఫోటోలు చాలా చోట్ల పెట్టాల్సి ఉంటుంది" అంటూ కేంద్ర ప్రభుత్వం వైఖరిపై విమర్శలు గుప్పించారు.

తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పని చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీని విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పేదలకు నాణ్యమైన ఆహారం అందించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు.

"సామాన్య ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతి విషయంలో అంకితభావంతో పనిచేస్తోంది. పేదల హక్కులను కాపాడేందుకు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వ చర్యలు కొనసాగుతాయి" అని మంత్రి హామీ ఇచ్చారు.

# వదిలిపెట్టే సమస్యే లేదు..

**సీఎం రేవంత్‌పై రెచ్చిపోయిన హరీష్ రావు**



**హైదరాబాద్ ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** రైతు భరోసా అమలుపై మరోసారి మాట తప్పిన రేవంత్ వైఖరి పట్ల బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం, మాటిచ్చి మోసం చేయడం, నాలుక మడతేయడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. మార్చి 31 కల్లా రైతు భరోసా డబ్బులు రైతులందరి ఖాతాల్లో వేస్తామని జనవరి 26న గొప్పగా ప్రకటించారు. మొన్నటి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి31 నాటికి రైతులందరికీ భరోసా డబ్బులు ఇస్తామని చెప్పారు. ఇవాళ ఏప్రిల్ 1వ తేదీ రానే వచ్చింది. ఇంతవరకూ రైతుభరోసా ఊసేలేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి మాటలు ఘనంగా ఉంటే, చేతలు హీనంగా ఉన్నాయని మండిపడ్డారు. మాటలు కోటలు దాటితే అడుగు గడప దాటడం లేదని సీరియస్ అయ్యారు. ముఖ్యమంత్రి మాటలు నమ్మి ఉగాది వేళ ఆశగా ఎదురుచూసిన రైతులకు చేదు అనుభవమే ఎదురైందని అన్నారు. రైతులను ఇంకెన్ని సార్లు మోసం చేస్తావు రేవంత్ రెడ్డి అని హరీష్ రావు ప్రశ్నించారు. దసరాకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు.. సంక్రాంతికి ఇస్తామని చెప్పి ఇవ్వలేదు.. ఉగాదికి ఇస్తామని చెప్పి ఇవ్వలేదు.. క్యాలెంటర్లు మారుతున్నాయి కానీ.. రేవంత్ నోట మాట మాత్రం మారడం లేదని అన్నారు. కొత్త సంవత్సరం రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేదు అనుభవాన్ని మిగిల్చిందని తెలిపారు. నాట్ల సమయంలో కేసీఆర్ రైతు బంధు ఇస్తే, రేవంత్ రెడ్డి కోతల సమయం వచ్చినా రైతు భరోసా ఇవ్వడం లేదని అన్నారు. మోసమే తన విధానంగా మార్చుకున్న రేవంత్ రెడ్డి రైతుల్ని అన్ని కోణాల్లో దగా చేస్తున్నాడని మండిపడ్డారు. 'రుణమాఫీని దారుణ వంచనగా మార్చిండు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అడుగు ముందుకు పడటం లేదు. డేట్లు మారుతున్నాయి, డెడ్ లైన్లు మారుతున్నాయి తప్ప, రైతులకు ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరడం లేదు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు, అసెంబ్లీలో ప్రకటించినట్లు రైతులందరికీ రుణమాఫీ చేసేదాకా, రైతు భరోసా ఇచ్చే దాకా నిన్ను బీఆర్ఎస్ పార్టీ వెంటాడుతూనే ఉంటుంది. ఎక్కడికక్కడ నిలదీస్తూ, మీ వైఫల్యాలను సిద్దిపేట పవర్ లో ఎండగడుతూనే ఉంటుంది' అని అన్నారు.

# విధ్వంసమే మీ ఏకైక నినాదం..

**మొదటిపేజి తరువాయి**



బుల్డోజర్లతో నెమళ్లు అరుపులతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. కంచె గౌచ్చిబౌలిలోని హెచ్‌సీయూ సమీపంలో ఉన్న 400 ఎకరాల భూమిని ఇటీవల కాంగ్రెస్ అమ్మేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. ఆ స్థలాన్ని చదును చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున బుల్డోజర్లను మోహరించారు. చదును చేయడాన్ని విద్యార్థులు అడ్డుకున్నారు. ఆ భూమి యూనివర్సిటీదేనని పేర్కొంటున్నారు. ప్రకృతి విధ్వంసాన్ని ఆపాలని.. అక్కడ ఉంటున్న జీవరాశిని కాపాడాలని విద్యార్థులతో పాటు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

# "వక్ఫ బిల్లు" పాస్ అవుతుందా.. బీజేపీ, ఇండీ కూటమి బలాబలాలు ఎంత..?

- పార్లమెంట్ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు..
- అడ్డుకునేందుకు ప్రతిపక్షాల వ్యూహాలు..
- ఎన్డీయే, ఇండియా కూటమి బలాబలాలు ఇవే..




**నేషనల్‌బ్యూరో ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్):** వక్ఫ్ బిల్లు బుధవారం లోక్‌సభ ముందుకు రాబోతోంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ బిల్లును ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ సహా ఇతర ఇండియా కూటమి పార్టీలు ఈ బిల్లును విమర్శిస్తున్నాయి. ముస్లింల హక్కుల్ని కాలరాసే బిల్లుగా అభివర్ణిస్తున్నాయి. ఈ బిల్లు ద్వారా వక్ఫ్ అపరిమిత అధికారాలను కట్టడి చేస్తామని బీజేపీ చెబుతోంది. ఇదిలా ఉంటే, వక్ఫ్ బిల్లు పార్లమెంట్ ముందుకు వస్తున్న తరుణంలో, బుధవారం ఉదయం రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలతో సమావేశం అవుతున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎంపీలంతా రేపు సభకు హాజరు కావాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. వక్ఫ్ బిల్లును అడ్డుకోవడానికి విపక్షాలు వ్యూహాలను రూపొందిస్తున్నాయి. ఇప్పటికే ఎస్పీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, ఎంఐఎం వంటి పార్టీలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గతేడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో, జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు వక్ఫ్ బిల్లుపై చర్చించారు. దీంట్లో 14 సవరణల్ని ప్రవేశపెట్టారు. రేపు మధ్యాహ్నం లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తుంది. లోక్‌సభలో 8 గంటల పాటు చర్చించనున్నారు. ఆ తర్వాత రాజ్యసభకు పంపనున్నారు.

**పార్లమెంట్‌లో బలాబలాలు..**

పార్లమెంట్‌లో వక్ఫ బిల్లు పాస్ అవుతుందా..? అనే చర్చ ఇప్పుడు నడుస్తోంది. అయితే, పార్లమెంట్‌లోని రెండు సభల్లో అధికార ఎన్డీయేకే బలం ఉంది. బిల్లు సులువుగా పాస్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. లోక్‌సభలో వక్ఫ్ బిల్లుకు 298 మంది ఎంపీల మద్దతు ఉంది, వ్యతిరేకంగా 233 మంది ఉన్నారు. తటస్థంగా 11 మంది ఎంపీలు ఉన్నారు. ఇక రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా 122 మంది ఎన్డీయే సభ్యుల మద్దతు ఉండగా, వ్యతిరేకంగా ఇండీ కూటమికి చెందిన 116 మంది ఎంపీలు ఉన్నారు. ఎలా చూసినా, కూడా ప్రతిపక్షాలు వాకౌట్ చేయడం తప్పితే, బిల్లును అడ్డుకునే అవకాశమే కనిపించడం లేదు.

సిద్దిపేట పవర్
తెలుగు దినపత్రిక
02.04.2025
బుధవారం | హైదరాబాద్

# దేశంలోనే సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుంది

- కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల వారికి సమన్యాయం
- గత 10 సంవత్సరాలలో కెసిఆర్ దొడ్డు బియ్యం అందజేసింది
- ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంది
- సిద్ధిపేట పట్టణంలో 10. 14. 43 వార్డులలో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ
- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



**సిద్ధిపేట;**తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న నిరుపేదలకు నేటి నుంచి ప్రతి నెల సన్న బియ్యం అందజేస్తాం అని కాంగ్రెస్ ది ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో 10. 14.34. 43 వార్డులలో రేషన్ కార్డు దారులకు డిసిఎస్వో తనుజ రెవెన్యూ అధికారులతో కలిసి సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల రేషన్ కార్డులో ఉన్న వ్యక్తులకు ఒక్కొక్కరికి 6 కిలోలు చొప్పున బియ్యాన్ని అందజేస్తాము అని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఆకలితో అలమటిస్తున్న వారికి అండగా ఉండేందుకే సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని అన్నారు. నిరుపేదలకు సన్న బియ్యం అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సాహోసపేతమైన నిర్ణయం తీసుకున్నారు అని అన్నారు. గత పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో నిరుపేదలకు సన్న బియ్యం అందిస్తాం అన్న ఆలోచన కూడా లేకుండా పోయింది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుంది అని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని ఒక్కొక్కటిగా నెరవేరుస్తాము అని అన్నారు. అర్హుల అందరికీ త్వరలోనే రేషన్ కార్డులు కూడా ప్రభుత్వం అందజేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఉపాధ్యక్షులు వంగరి నాగరాజు బొమ్మల యాదగిరి మహిళా జిల్లా అధ్యక్షురాలు ముద్దాం లక్ష్మి కౌన్సిలర్ ఆలకుంట మహేందర్ ప్యాయ్యావుల ఎల్లం పూర్ణిమ బుచ్చిరెడ్డి కలిముద్దీన్ మార్క సతీష్ గౌడ్ గయాజుద్దీన్ వహాబ్ అజ్మత్ మజార్ మలిక్ సలీం చెంది శీను అరవింద్ రాకేష్ రాజిరెడ్డి సన్న రజిని తదితరులు నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు

# సన్నబియ్యంతో పేదింట్లో సంతోషం

**సిద్ది పేట పవర్:**కొమురవెల్లి:రేషన్ షాపుల్లో ఇస్తున్న సన్నబియ్యంతో పేదింట్లో సంతోషం వ్యక్తం అవుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం గురువన్నపేట లో సన్న బియ్యం పంపిణీని చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ కట్టుబడి ఉందని పేదలకు కడుపునిండా అన్నం పెట్టడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి రేషన్ కార్డుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. కాంగ్రెస్తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లోకాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బ్రహ్మాండ్లపల్లి చంద్రం మహిళా అధ్యక్షురాలు గుర్రాల శిరీష బుడిగె ఐలేని అశోక్ మకిలీ నరేందర్ బాలమళ్ళు తుక్కోజీ సుధాకర్ బుడిగేసాయికుమార్ నాగరాజు గుర్రాల పోషాద్రి దండు రమేష్ తదితరులు పాల్గొని రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.




# సన్నబియ్యం ఇచ్చే ఏకైక స్టేట్ తెలంగాణ..



**మంత్రి పొన్నం**

**సిద్ది పేట పవర్ ప్రతినిధి:** దేశ వ్యాప్తంగా రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణనే అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఇవాళ ఉదయం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీని అట్టహాసంగా ప్రారంభించిందని అన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,263 రేషన్ దుకాణాల ద్వారా 2.91 లక్షల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. అంతుకు ముందు రైతులను, అధికారులను సన్న బియ్యం పంపిణీకి సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.





# సన్న బియ్యం ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట జిల్లా దుబ్బాక ఏప్రిల్1 సిద్దిపేట పవర్ న్యూస్**

మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దుబ్బాక్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన సన్నబియ్యాన్ని ప్రారంభించి పేదలకు రాబోవు రోజుల్లో కడుపు నింపుతామని చరిత్రలో సోనియా గాంధీ రాహుల్ గాంధీ కలలు కన్న భారత అవనిలో పేదలకు కడుపు నింపి తెలంగాణ ఇచ్చిన దేవత సోనియమ్మ సాక్షిగా సన్న బియ్యం అందిస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందని పెద్ద గుండవెల్లి గ్రామ కాంగ్రెస్ కార్యకర్త సద్ది అంజిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాడారం భాస్కర్ గౌడ్ బంధుగు ల బాబురావు, యాడారం రామకృష్ణగౌడ్,సద్ది రాజిరెడ్డి గూడూరు రవి, డీలర్లు నిమ్మచెట్టు ఎల్లం, పెంటమ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# 8న సిద్దిపేట లో నందిని సిధారెడ్డి కథా సంపుటి

**" బందారం కథలు "పుస్తకావిష్కరణ సభ**
**హాజరకానున్న ప్రముఖ సంపాదకులు కె. శ్రీనివాస్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ లు..**

**సిద్ధిపేట, ఏప్రిల్:1** ప్రాఖ్యత కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి రచించిన కథా సంపుటి బందారం కథలు పుస్తకం ఆవిష్కరణ సభ ఈ నెల 8 న సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో మంగళవారం కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె. రంగాచార్య, ప్రధాన కార్యదర్శి సిద్దంకి యాదగిరి, ప్రముఖ రచయిత పప్పుల రాజిరెడ్డి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు పొన్నాల బాలయ్య,గౌరవ అధ్యక్షులు తోట అశోక్, తెలంగాణ వికాస సమితి అధ్యక్షులు నందిని భగవాన్ రెడ్డి, కవి గంభీర్ రావుపేట యాదగిరి, మరసం ఉపాధ్య క్షులు అలాజ్ పూర్ శ్రీనివాస్, కవి మధుసూదన్ రెడ్డి లు పాల్గొని మాట్లాడుతూ ప్రఖ్యాత రచయిత, కవి డాక్టర్ నందిని సిధారెడ్డి కవిగా సాహిత్య ప్రపంచం లో తనదైన చెరగని ముద్ర వేశాడని అన్నారు.. ఆయన స్వగ్రామమైన బందారంలో తన జీవిత అనుభవ సారాన్ని కథలుగా రూపొందించి " బందారం కథలు " పేరిట విలువరించారని తెలిపారు.. ఆ కథా సంపుటి ఆవిష్కరణ సభ సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఈనెల 8 న మంగళవారం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు ప్రముఖ పత్రికా సంపాదకులు కె. శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. సభలో ప్రముఖ గాయకుడు, కవి, శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ ఆత్మీయ అతిధిగా హాజరావుతారని తెలిపారు. రచయిత వి. శంకర్ పుస్తక పరిచయం చేస్తారని తెలిపారు.సభలో ప్రముఖ రచయితలు తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య, సిద్దెంకి యాదగిరి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సాయంత్రం 4:30 కి ఈ సాహిత్య సభ ప్రారంభం అవుతుందని కవులు, రచయిత లు, సాహిత్య కారులు, గాయకులు, కళాకారులు సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు..




# ఆహార భద్రత చట్టాన్ని ఇచ్చిందే కాంగ్రెస్!

**సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి!**

**సిద్దిపేట పవర్ , ఆత్మకూరు:** బీద మధ్యతరగతి ప్రజలకు ఆహార భద్రత, ఉపాధి హామీ చట్టాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మంత్రిఉత్తంకుమార్ రెడ్డి చలువతో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసి ఆర్థికంగా నిలదొక్కునేలా కృషి చేసిన అన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వని సంక్షేమ పథకాలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కడిగా అమలు చేస్తూ ముందుకు పోతుందన్నారు. టిఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు అన్నారు. కాంగ్రెస్ మైనార్టీల సంక్షేమానికి వారి భద్రతకు పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారులకు వచ్చి 14 నెలల్లోని ఉచిత బస్సు ఉచిత కరెంటు, మహిళలకు పావులా వడ్డీ, మూడు సిలిండర్ల గ్యాస్ సబ్సిడీ ఇందిరమ్మ ఇండ్లు యువతకు ఉద్యోగ ఉపాధి వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంల ఆత్మకూరు చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్ ఆత్మకూరు మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు మండలపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, ప్రధాన కార్యదర్శి డీలర్ వెంకటేశ్వర్లు, బరుపట్ల కిరీటి అయోధ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహాన్ని తొలగిస్తే ఊరుకోం

**తెలంగాణ స్టేట్ అంబేద్కర్ యువజన సంఘం నేతలు**

**సిద్ధిపేట:** 16 సంవత్సరాల క్రితం నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అవిలయ్య ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సిద్దిపేట నుండి ముండ్రాయి మీదుగా ఎల్కతుర్తి వరకు కొనసాగుతున్న హైవే రోడ్డు విస్తరణ,నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని పూర్తిగా తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఐదు గ్రామాలకు కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించకుండా అక్కడ ఒక సర్కిల్ ఏర్పాటు చేయాలని ఇందుకు స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రి హరీష్ రావు గారు చొరవతో, గ్రామ నాయకులు మరియు మండల టిఆర్ఎస్ నాయకులు బాధ్యతగా వ్యవహరించి అంబేద్కర్ విగ్రహాన్ని అదే స్థలంలో సర్కిల్ ఏర్పాటు చేసి మండలానికి ఆదర్శంగా నిలిచి, శూద్ర కులాలైన ఖమ్మ, రెడ్డి, వెలమ, కులాలకు అంబేద్కర్ చేసిన సేవలకు రుణం తీర్చుకోవాలని కోరారు. ఈ విగ్రహాన్ని తొలగించాలని కొంతమంది స్థానిక నాయకులు ప్రయత్నిస్తున్నారని వారు కుటిల ప్రయత్నాలు మానుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాయుద్ధనౌకగద్దర్ అభిమాన సంగం రాష్ట్ర అధ్యక్షులు సి.యల్. యాదగిరి మాట్లాడుతూ ఒకవేళ అంబేద్కర్ విగ్రహం తొలగిస్తే కులాలు, మతాలు, రాజకీయాల, కతీతంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని, ఇందుకు ఉదాహరణ ట్యాంక్ బండ్ మరియు ఇతర చోట్ల విగ్రహాన్ని మార్చడం ఆపేసిన విషయం మరవద్దని హెచ్చరించారు. ఈ విగ్రహా రక్షణ నియోజకవర్గానికి, మండలానికి, చెందిన ప్రజాప్రతినిధులదేనని, తెలిపారు, ఒకవేళ జాతీయ రహదారి విస్తరణ పేరుతో విగ్రహాన్ని మారిస్తే అందుకు స్థానిక రాజకీయ, నాయకులు, మూల్యం, చెల్లించాల్సి ఉంటుందని, హెచ్చరించారు, ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్, కోశాధికారి మరియన్న, జిల్లా కోఆర్డినేటర్ కల్లాటి సంజీవ్, న్యాయవాది ఎ.బాపురావు, నాయకులు గంటమల్లేష్, బాల్ రాజు, యాదగిరి, కోడూరు రాంబాబు, కె.రాజు, కనకయ్య, దేవులపల్లి బాల్ రాజు, న్యాయవాది బాల్ రాజు, మహేష్, మల్లిగారి ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆస్తికావాలే కానీ అమ్మ వద్ద..

**ఆస్తి గుంజుకొని కన్నతల్లిని సరిగా చూడలేని కొడుకుపై కలెక్టర్ మను చౌదరి చర్య తీసుకోవాలని విజ్ఞప్తి.**



**సిద్దిపేట పవర్ :**సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన తాటిపాముల బాలవ్వ భర్త భూమయ్య వయస్సు 85. భర్త చనిపోయిన తన రెండెకరాల భూమిని కొడుకు నమ్మబలికి మంచిగా చూసుకుంటానని ఆశ చెప్పి జాగా తన పేరు మీద ఎక్కించుకున్న తర్వాత తాటిపాముల భూపతి తన తల్లిని తాటిపాముల బాలవ్వ ను కొడుతూ తిడుతూ రకరకాల ఇబ్బందులకు మనోవేదనకు గురిచేస్తూ ఆస్తి చేజిక్కించుకున్న తర్వాత తనను సరిగా చూసుకోవడం లేదని,ఇబ్బందుల పాలు గురి చేస్తున్నాడని తాటిపాముల బాలవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. తాటిపాముల భూపతి తన తల్లి తాటిపాముల బాలవ్వ ను కొడుతూ హింసకు గురి చేస్తూ మెడపై చంపుతానని బెదిరిస్తూ తన యొక్క మానసిక వేదనతో ఇబ్బందుల పాలు చేస్తూ చంపుతానని బెదిరిస్తూ దుర్భసలాడుతూ తన కొడుకు తాటిపాముల భూపతి పై చట్టరీత్యా క్రమశిక్షణ చర్యలు తీసుకొని క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మన చౌదరికి తాటిపాముల బాలవ్వ విజ్ఞప్తి చేసింది. తాటిపాముల భూపతి ని కలెక్టర్ మన చౌదరి తన భూమిని తనకు ఇప్పించి తన రెండెకరాల పొలంను తాటిపాముల భూపతి నుండి తన పైకి పట్టేదారు పాసుబుక్ ఇప్పించాలని కలెక్టర్ మను చౌదరిని తాటిపాముల బాలవ్వ ప్రాధేయపడింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతుగోడును గోషను తన బాధను వెల్లగెక్కింది. తన భూమి తనకు ఇప్పించని ఎడల ఆత్మహత్య శరణ్యం తనకు మరణం దిక్కని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని విలేకరులతో గోడును వెలబుచ్చుకుంది. వృద్ధులను తల్లిదండ్రులను సరిగా చూసుకొని ఈ రోజుల్లో కలెక్టర్కు మన చౌదరికి తన భూమిని తన ఇప్పించాలని ప్రాధేయపడింది. మంచిగా చూసుకుంటానని నమ్మించి జాగా పేరు మీదికి రాగానే తాటిపాముల భూపతి నన్ను ఇబ్బందుల పాలు చేస్తున్నాడని తల్లి తాటిపాముల బాలవ్వ హృదయ ఆవేదనతోతన బాధను గోడును వెళ్లబుచ్చుకుంది. కలెక్టర్ మను చౌదరికి తన పేరు మీద ఉన్న భూమిని తిరిగి నాకు ఇప్పించాలని తాటిపాముల భూపతి పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తల్లి తాటిపాముల బాలవ్వకలెక్టర్ ను కోరింది.

# HCU భూములను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ధారా దత్తం చేయడాన్ని నిరసిస్తూ ఆందోళనలకు పిలుపు ఇవ్వడం తో ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

**సిద్దిపేట పవర్ చేర్యాల1 ఏప్రిల్** తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి ప్రశాంత్ * ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ లను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు

నియంతలాగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి నిర్భందాన్ని ప్రయోగిస్తూ అక్రమ అరెస్టులు చేస్తే ఊరుకునేది లేదు.

ఉదయం లేవకముందే విద్యార్థి నాయకులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనం

**(ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ తీరుని మార్చుకోవాలి.)**

తెలంగాణ రాష్ట్రంలోని గత ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేసిందని, నియంతృత్వాన్ని, అహంకారాన్ని ప్రదర్శించిందని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అంతకంటే ఎక్కువగా తెలంగాణ రాష్ట్రంలో నిర్భందాన్ని, అహంకారన్ని ప్రదర్శిస్తున్నారు అని వారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మాపై ఎన్ని ఒత్తిడిలు తెచ్చిన. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ఇచ్చే ప్రసక్తే లేదు

ప్రజా పాలన కాదు విద్యా వ్యతిరేక ప్రజావ్యతిరేక పాలన

గతంలో విద్యార్థులతో, నిరుద్యోగులతో పెట్టుకున్న KCR తెలంగాణ రాష్ట్రంలో కనుమరుగైపోయాడు.. మీ యొక్క నియంతనం పాలన కూడా ఎక్కువరోజులు సాగదు ఖబర్దార్

రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా నిర్బంధం విద్యార్థుల వల్ల ప్రయోగిస్తే రానున్న రోజులలో ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్ద దింపడానికి కూడా వెనకడం విద్యార్థి నాయకులు హెచ్చరించారు.




# యువతను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమిద్దాం

**కల్లూరు ధర్మేంద్ర ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి**

**వలిగొండ,ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్ ):** భువనగిరి జిల్లా,వలిగొండ మండల నాలుగవ మహాసభ స్థానిక శివశక్తి ఫంక్షన్ హాల్ లో మారోజు నరసింహ చారి అధ్యక్షతన జరిగింది. ఏఐవైఎఫ్ జండాను ధర్మేంద్ర ఎగరవేసి మహాసభను ప్రారంభించారు.ఈ సందర్భంగా కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ పాలకులు స్వార్ధ నీచ రాజకీయాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు. కానీ ఆ బాధ్యత మరిచి ప్రజల మధ్య విభజన సృష్టించి అశాంతిని నెలకొల్పాలని చూస్తున్నారని ఈ చర్యలను యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి హక్కులు పొందడం మన హక్కు అన్నారు.ప్రతి సంవత్సరం 10 కోట్ల ఉద్యోగాలు ఆవిరైపోతున్నాయి అన్నారు ప్రతి సంవత్సరం రూ.10 లక్షలు ఉద్యోగాలు మాత్రమే పుట్టుకొస్తున్నాయని అన్నారు. జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ ఏఐవైఎఫ్ విద్య వైద్యం ఉపాధి హక్కుల కోసం నిరంతర పోరాటం నిర్వహించాలి అని అన్నారు.వలిగొండ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు.ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్నారు.ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ పెరబోయిన మహేందర్ మాట్లాడుతూ పాలకుల యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్,మండల కార్యదర్శి పోలిపాక యాదయ్య,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి తదితరులు పా






# రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి నాయకుల పై అక్రమ అరెస్టులను ఖండించండి

**వేముల నాగరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు**

**వలిగొండ,ఏప్రిల్ 01(సిద్దిపేట పవర్ ):** భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామం లో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి నాయకులపై జరిగిన అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల పాలన సాగిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు కట్టుబెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు.విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం దాడి చేసి అక్రమ అరెస్టులు చేయడం సరి అయింది కాదు అన్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్య కాపాడుతామని అన్నారు కానీ ,ఈ రోజు అక్రమ అరెస్టులుచేస్తున్నారు.అటవీ ప్రాంతంని తొలగించి మూగజీవుల ప్రాణాలు తీస్తున్నారు అని అన్నారు. యూనివర్సిటీ భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు.ఇదే వైఖరితో ముందుకు పోతే ఎస్ఎఫ్ఐ గా రాష్ట్రంలో అన్ని విద్యార్థుల సంఘాలను కలుపుకొని ఆందోళనలు ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు. 400 ఎకరాల భూమిని కాపాడేందుకు పోరాటం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వేముల జ్యోతిబాస్,బుగ్గ ఉదయ్ కిరణ్,దొడ్డి రాము,సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# ఆపద లో ఉన్న వారికీ అపర సంజీవినిగా "108"

- అత్యవసర పరిస్థితి లో గోల్డెన్ హావర్ లో ప్రాథమిక చికిత్స...
- 24/7 సేవలతో ప్రజల మన్ననలు పొందుతున్న "108"...
- సుశిక్షితులైన పారామెడికల్ సిబ్బందితో వైద్య సేవలు...
- ఆసుపత్రి స్థాయికి సమానంగా "108" అంబులెన్స్ సేవలు...
- బాధితులకు మెరుగైన వైద్యం అందించడమే వారి లక్ష్యం..
- అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల (ఈఎంటి) దినోత్సవం సందర్భంగా మెడికల్ టెక్నీషియన్ బైండ్ల మహేందర్ పై సిద్దిపేట పవర్ అందిస్తున్న ప్రత్యేక కథనం...



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్పీన్ బోర్డు సహాయంతో అంబులెన్సు లోకి తరలిస్తున్న మెడికల్ టెక్నీషియన్ మహేందర్






గర్భిణీకి ఇంట్లోనే సుఖ ప్రసవం చేసిన మెడికల్ టెక్నీషియన్ మహేందర్



మెడికల్ టెక్నీషియన్ మహేందర్



సిద్దిపేట జిల్లా "108"కోర్డినేటర్ హరిరమా కృష్ణ



ఉమ్మడి మెదక్ జిల్లా"108" ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్....

**సిద్దిపేట పవర్ కొండపాక ఏప్రిల్ 01:** 108 అంబులెన్స్.... ప్రాణాపాయం లో ఉన్నవారికి ప్రాణం పోసే వాహనం. ఈ వాహనం ఓ చిన్నపాటి ఆస్పత్రి లాంటిది. యాక్సిడెంట్ అయినా..ఎవరైనా ప్రాణాపాయంలో ఉన్నా ఠక్కున గుర్తుకొస్తుంది అంబులెన్స్. ఆ వాహనానికి నంబర్ 108 (Ambulance 108)అనే విషయం అందరికి తెలిసిందే. 108కు డయల్ చేసి హలో అంటే చాలు కుయ్ కుయ్ మంటూ వచ్చేస్తుంది. ఆ వాహనంలో ప్రథమ చికిత్స అందించే సిబ్బంది ఉంటారు. వెంటనే ఆస్పత్రికి తరలించి బాధితుల ప్రాణాలు కాపాడుతారు. అటువంటి అంబులెన్స్ కు 108 అనే నంబర్ పెట్టటం వెనుక చాలా అర్థం ఉంది.

### ఉత్తమ సేవ... అవార్డుల పంట.....

2012 లో అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి గీతా రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ మెడికల్ టెక్నీషియన్ అవార్డు అందుకున్నాడు. 2013 నుండి 2020 వరకు వరుసగా జిల్లా కలెక్టరు లు దినకర్ బాబు, రోనాల్డ్ రోస్, వెంకట్రామిరెడ్డి ల చేతుల మీదుగా , రాష్ట్రస్తాయి లో ఉత్తమ మెడికల్ టెక్నీషియన్ అవార్డ్స్ అందుకోవటం జరిగింది.2022వ సంవత్సరంలో జాతీయ స్థాయిలో ఉత్తమ మెడికల్ టెక్నీషియన్ అవార్డును కూడా అనుకున్నారు. 2023వ సంవత్సరంలో అపస్మారక పరిస్థితి కి వెళ్లిన వ్యక్తి కి సి పి ఆర్ (CPR) చేసి ప్రాణాలు కాపాడినందు కు అప్పటి తెలంగాణ రాష్ట్రఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చేతులమీదుగా కూడా ఆవార్డులు అందుకున్నారు.2024 సంవత్సరం ఆగస్ట్ 15 న సిద్దిపేట జిల్లా తరపున ఉత్తమ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ అవార్డును తెలంగాణా రాష్ట్ర బీసీ& ట్రాన్స్పోర్ట్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి , అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, సిద్దిపేట జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అనురాధ సమక్షంలో అవార్డును అందుకున్నారు.



108 నంబర్ (Ambulance services 108) వెనుక పెద్ద చరిత్రే ఉంది. ప్రమాదాల్లో గాయపడిని వారికి 108 అనేది సంజీవని అని చెప్పాల్సిందే.... విధి నిర్వహణలో అత్యవసర వేళలో ప్రమాదాలు జరిగినప్పుడు సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సకాలంలో వైద్య సేవలు అందిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బందిని,ప్రభుత్వం తోపాటు ప్రజలు కూడా సేవలను ప్రశంసిస్తున్నారు.

అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుల (ఈఎంటి) దినోత్సవం సందర్భంగా వారు చేస్తున్న సేవల పై ""సిద్దిపేట పవర్ "" అందిస్తున్న ప్రత్యేక కథనం....

అత్యవసర పరిస్థితి లో గోల్డెన్ హావర్ లో ప్రాథమిక చికిత్స అందిస్తూ, 24/7 సేవలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు.సుశిక్షితులైన పారామెడికల్ సిబ్బందితో వైద్య సేవలు, ఆసుపత్రి స్థాయికి సమానంగా "108" అంబులెన్స్ సేవలు అందిస్తున్నారు.మెడికల్ టెక్నీషియన్ బైండ్ల మహేందర్ ...గత 17 సంవత్సరాలు గా "108" లో విధులు నిర్వహిస్తు వివిధ రకాల ప్రమాదాల బారిన పడిన వారిని కాపాడి మరియు వివిధ రకాల సందర్భాలలో గర్భిణీలకీ అంబులెన్సు లోనే సుఖ ప్రసవం చేసి తల్లి, బిడ్డలను కాపాడటం జరిగింది.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**సిద్దిపేట పవర్ సిద్దిపేట ఏప్రిల్ 01:** సిద్దిపేట పట్టణం పటేల్ పుర లోని రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా దళిత కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బొమ్మల యాదగిరి, రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ ఎండి కలీముద్దీన్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. తెలుగు నూతన సంవత్సర ఉగాది సందర్బంగా సిద్దిపేట పట్టణంలోని 37 వ వార్డు లో రేషన్ షాప్ నెంబర్ 23,22 సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పటేల్ పురలో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న బిపిఎల్ కుటుంబంలోని ప్రతి సభ్యునికి దొడ్డు బియ్యం కు బదులుగా ఆరు కిలోల సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 89.73 లక్షల తెల్లరేషకార్డులు ఉండగా, వీటి ద్వారా 2.8 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు. 30 లక్షల కొత్త దరఖాస్తులతో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.10 కోట్లకు చేరుకుంటుంది. రేషన్ దుకాణాల ద్వారా 3.10 కోట్ల మందికి ఉచితంగా సన్న బియ్యం అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు అన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం ఏటా రూ.10,600 కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి బొమ్మల ప్రవీణ్. జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు బొమ్మల చంద్రశేఖర్. కాంగ్రెస్ నాయకులు బుక్క బాబు నక్క రాకేష్ బొమ్మల చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# నేడే ఢిల్లీలో బీసీ సంఘాల ధర్నా..

**ఢిల్లి బయలుదేరిన వెళ్లిన టి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రులు, ఎమ్మెల్యేలు**

**సిద్దిపేట పవర్ హైదరాబాద్ ఏప్రిల్ 01:** బీసీ లకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసనసభలో చేసిన చట్టాన్ని పార్లమెంట్ లో ఆమోదించాలని తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రులు పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద బుధవారం జరిగే బీసీ సంఘాల మహా ధర్నా లో పాల్గొనేందుకు పీసీసీ చీఫ్ తోపాటు , మంత్రులు పొన్నం ప్రభాకర్ ,కొండా సురేఖ, బీసీ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య,వాకిటి శ్రీహరి ,మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రకాష్ గౌడ్, ఈర్లపల్లి శంకరయ్య తదితర నేతలు ఢిల్లీకి ప్రయాణమయ్యారు. మహాధర్నా అనంతరం కేంద్ర మంత్రులు,జాతీయ పార్టీ నేతలను కలిసి బీసీ రిజర్వేషన్ల పెంపు చట్టానికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు.



# ఎమ్మెల్యే బంధువర్గం కోసమే బ్రిడ్జి నిర్మాణం.

- సీఎల్ రాజం ఎమ్మెల్యే కుమ్మక్కై ప్రజాధనం వృధా చేస్తుండ్లు.
- రియల్ ఎస్టేట్ ధర పెంచేందుకు ఎమ్మెల్యే కుట్రలు.
- ఆరెంద మానేరుపై బ్రిడ్జి నిర్మిస్తే అనేక ప్రయోజనాలు.
- 40ఏండ్లు ఒకే కుటుంబానికి ఓట్లేసి ఆగమైపోతున్నం.
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.

**మంథని,ఏప్రిల్01(సిద్దిపేట పవర్):** మంథని ఎమ్మెల్యే తన బందువర్గ ప్రయోజనాల కోసమే గోదావరినదిపై రూ.300కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు.మంగళవారం సాయంత్రం మంథని గోదావరినది తీరంలో బ్రిడ్జి నిర్మాణం జరిగే ప్రదేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా శివ్వారం నుంచి మంథని గోదావరినదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారని తెలిపారు.అయితే గోదావరి నదిపై నిర్మించే బ్రిడ్జితో ప్రజలు ఎలాంటి ఉపయోగం లేదని,కేవలం ఎమ్మెల్యే బంధువర్గం ప్రయోజనాల కోసమేనన్నారు.మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్పల్లి సమీపంలో ఎమ్మెల్యే బంధువైన సీఎల్ రాజంకు 50ఎకరాల భూములు ఉన్నాయని,రియల్ ఎస్టేట్ లో వాటి ధరలు పెంచేందుకే ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారన్నారు.మంథని గోదావరినది నుంచి కూచిరాజ్పల్లి వద్దనే రోడ్డు కలుస్తుందని,ఎక్కడా హైవేకు కనెక్ట్ లేదన్నారు.బ్రిడ్జి నిర్మిస్తే శివ్వారం వెళ్లిన ప్రజలకు అక్కడినుంచి చెన్నూర్ వెళ్లాలంటే సుమారు 20కిలో మీటర్ల మేర వెళ్లాల్సి ఉంటుందన్నారు.అయితే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిరిపురం వద్ద గోదావరనదిపై పెద్ద వంతెన నిర్మించారని,ప్రస్తుతం ఆ వంతెనపై నుంచి రాకపోకలు సాగుతున్నాయని ఆయన గుర్తు చేశారు.అంతేకాకుండా శివ్వారం వద్ద నిర్మించే బ్రిడ్జితో మంథని నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి మేలు జరుగదన్నారు.కేవలం బంధు మిత్రులు తప్ప ఎలాంటి వ్యాపారలావాదేవీలు అటువైపు లేవన్నారు.వేలాలలో ఉన్న ఎమ్మెల్యే బంధువులతో పాటు సీఎల్ రాజం రియల్ ఎస్టేట్ భూముల ధరలు పెంచేందుకే ఈ బ్రిడ్జి అన్నారు. అయితే తాము ఈ ప్రాంత ప్రజల అవసరాలను గురించి ఆనాడే ఆరెంద మానేరుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని,అనేక ఏండ్ల క్రితం అడవిసోమన్పల్లి వద్ద స్వర్గీయ మాజీ ప్రధాని నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థలో ఉందన్నారు.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో అడవిసోమన్పల్లి బ్రిడ్జి ఉందని,ఆ బ్రిడ్జికి ఏదైనా ప్రమాదం జరిగితే రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలు 40ఏండ్లుగా ఒకే కుటుంబానికి ఓట్లు వేసి అవకాశాలు కల్పిస్తే కనీసం ప్రజల అవసరాలను గుర్తించడం లేదన్నారు.మంథనిలో పుట్టిన వాళ్లు నాయకులు అయితేనే గొప్పగా ఆలోచన చేస్తారని,అలాంటి వాళ్లకు అవకాశం ఇస్తే ఇప్పటికే మంథని ఆకాశం అంత అభివృద్ధి చెంది ఉండేదన్నారు.సీఎల్ రాజం ,మంథని ఎమ్మెల్యే కుమ్మక్కై కుట్ర చేసి రూ.300కోట్ల ప్రజాధనం వృధా చేసేందుకు చూస్తున్నారని ఆయన వివరించారు.ప్రతిసారి ఓట్లు వేసి గెలిపించే మంథని ప్రజల గురించి ఆలోచించి ఉంటే బోయిన్పేట,గొల్లగూడెం,కూచిరాజ్పల్లి వాసులకు మేలు జరిగేలా రింగ్రోడ్డు నిర్మించాలన్నారు.అలాగే ఈ ప్రాంత ప్రజలపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఆరెంద మానేరుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే ఆలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.శివ్వారం వద్ద నిర్మించే బ్రిడ్జితో ఎలాంటి ప్రయోజనాలు లేవనే విషయాన్ని గ్రహించాలని,కేవలం ఎమ్మెల్యే బంధువుల భూముల ధరల పెంపుకేననే విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు.

